# యామినీదివాకరం

-అన్నంరాజు వేణుగోపాల శ్రీనివాసమూర్తి

సరిగ్గా స్కూలుకు బయల్దేరేటప్పుడు వచ్చిందా కాల్. చిరాకని పించింది నాకు. అసలే ఈ వేళప్పుడు ఒకటే హడావుడి, టెన్షన్. పరుగున వెళ్లి ఆ బస్సులో పడేదాక ప్రశాంతంగా ఉండదు. లేటైతే స్కూలు బస్సు వెళ్లిపోతుంది. సొంత ఛార్జీ పెట్టుకుని రిక్షా మీద వెళ్లాల్సి వుంటుంది. పైగా ప్రిన్సిపాల్ మూడ్ సరిగ్గా లేకపోతే రిజిస్టర్‌లో ఆబ్సెంట్ పెట్టేసినా పెట్టేస్తాడు. అనవసరంగా బోలెడు డబ్బు కట్ అవుతుంది.

"అంతసేపటి నుంచీ మోగుతుంటే ఎత్తవేమిట్రా ఆ ఫోన్?" డ్రెస్ చేసుకుంటుంటే అమ్మ సతాయింపు వంటింట్లో నుంచి.

"అబ్బబ్బ... ఈ సెల్ కొని చాలా తప్పు చేసాను" విసుక్కుంటూనే తీసాను. అంతసేపూ పడ్డ టెన్షన్ అంతా ఎగిరిపోయింది.

'యామినీ'! అబ్బో చాలా రోజులకు కరుణించిందే?

"హలో దివాకర్!"

"చెప్పు యామినీ... నేనే" అన్నాను ఆరాటంగా.

"డాడీ పోయారు. ఈ టైమ్‌లో నీ సాయం నాకెంతైనా అవసరం" వణికే కంఠంతో అంది యామిని.

"అలాగే... ఇప్పుడే వస్తున్నాను. ధైర్యంగా ఉండు" అని స్కూలుకు సెలవు చెప్పేసి ఆదరాబాదరగా వెళ్లి ఆటోలో కూర్చున్నాను.

"అబ్బ... అంత పెద్దగా నవ్వుతావేమిటి? అసలు నువ్వలా ఎలా నవ్వగలవు బాబూ... నీకేం సమస్యలూ, గట్రా వుండవా?" యామినీ మాటలు గుర్తుకొస్తున్నాయి.

"సమస్యలుంటే ఏడుపు మొహం పెట్టుకోవాలా? లేకపోతే కనిపించిన వాళ్లందరి దగ్గరా ఏకరవు పెట్టమంటావా? లైట్‌గా తీసుకోవాలమ్మా. నవ్వుతూ నవ్విస్తూ బ్రతకాలి. ఏదీ... ఆ అందమైన పెదవులపై ఒక్క చిరునవ్వు వెలయించు... స్మైల్ ప్లీజ్" అనేవాడ్ని.

నిశ్శబ్దంగా నా కన్నుల వంక చూసిన ఆమె కన్నుల్లో నీళ్లు ఎందుకో నాకర్థం అయ్యేదికాదు. అడిగినా చెప్పడానికి అభిమానపడేది. ఆమెని ఇబ్బంది పెట్టడం ఎందుకులే అని నేనూ ఆ తరువాత అడగడం మానేసాను.

నేను వెళ్లేసరికి తండ్రి దగ్గర కూర్చుని ఏడుస్తున్న తల్లిని ఓదారుస్తోంది యామినీ. ఫర్వాలేదు. పైకి ధైర్యంగానే కనిపిస్తోంది.

"ఎంతసేపైందిపోయి... అందరికీ తెలియపరిచావా? ఎవ్వరూ రాలేదేం?" అడిగాను అక్కడున్న బల్లమీద కూర్చుంటూ.

"పోయి రెండుగంటలైంది. మాకు పెద్దగా ఎవరున్నారని రావడానికి. వస్తే మా పెద్ద బాబాయ్ రావాలి" అంటున్నంతలోనే ఆయనే కాబోలు వచ్చారు. నా పక్కనే తనూ కూర్చుని భావరహితంగా చూస్తూ "ఊరుకోమ్మా... ఊరుకో. ఉన్నన్నాళ్లూ నిన్నేం సుఖపెట్టాడు కనుక పోయాడని ఏడవడానికి. తాగి తాగి వళ్లు గుల్ల చేసుకున్నాడు. ఏదో దానికా ఉద్యోగం ఉండబట్టిగానీ లేకపోతే ఏమైపోయేవాళ్లు మీరు?" అంటున్నాయన.

నేను ఆయన వెళ్లి ఎలక్ట్రికల్ క్రిమేషన్ కార్యక్రమం తంతు పూర్తిచేసి ఇంటికి వస్తుంటే అడిగారాయన.

"యామినీ ఫ్రెండ్‌వా బాబూ... ఏం చేస్తుంటావు?"

"టీచర్‌గా చేస్తుంటానండీ... డిగ్రీలో యామినీ నా క్లాస్‌మేట్.." అంటుంటే ఆ రోజులు మా మనసులో మెదిలి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఏదో అవ్యక్త వేదనతో అలా అయిపోయిందిగానీ ఎంత బావుండేది యామినీ. అందానికి అందం, చదువు, సంస్కారం, చక్కని మాట తీరుతో అందరినీ ఇట్టే ఆకట్టుకునేది. ప్రతీ పరీక్షలోనూ ఫస్ట్ మార్కులు తెచ్చుకుని లెక్చరర్స్ అందరి చేతా శభాష్ అనిపించుకునేది. సంగీతం, సాహిత్యం, మంచి సినిమాలు ఆమెకు ఇష్టమైన విషయాలు.

'పదిమందిలో పాట పాడినా.. అది అంకితమెవరో ఒకరికే' అంటూ పాటల పోటీలో నేను పాడితే నన్ను మనసారా అభినందించింది. తను చెప్పినట్లే నాకు ఫస్ట్‌ప్రైజ్ వచ్చింది. కాలేజీ ఆడిటోరియం దగ్గర గుల్‌మోహర్ చెట్టు కింద కూర్చుని ఎన్నెన్ని కబుర్లు కలబోసుకునేవాళ్లం.

చలం, శరత్ సాహిత్యం గురించి యామినీ మాట్లాడుతుంటే నాకెంతో ఇష్టంగా ఉండేది. మంచి మంచి పుస్తకాలు సెలెక్ట్‌చేసి తీసుకుని ఇచ్చేది చదవమంటూ. పుస్తక పఠనం ప్రత్యేకించి పాతతరం గొప్ప గొప్ప రచయితల పుస్తకాలు చదవడం అలవాటైంది ఆమెవల్లే. మల్లీశ్వరి, బాటసారి, విప్రనారాయణ వంటి సినిమాల్లోస్తే పట్టుబట్టి నన్ను బలవంతంగా తీసుకెళ్లి చూపించేది. నాకూ చాలా నచ్చేవి ఆ సినిమాలు. క్రమంగా ఆమె అభిరుచులు, ఆసక్తులూ నావీ అయ్యాయి. ఆ స్నేహ పరిమళం నన్నెంతో పరవశపెడుతోంది.

"నీతో ఇలా మాట్లాడుతుంటే కలిసి తిరుగుతుంటే ఎంతో సంతోషంగా ఉంటోంది" అనేది యామిని. తనలా అంటోంది కదాని నేను కొంచెం చొరవ చూపిస్తే మాత్రం సీరియస్ అయిపోయేది. ఎన్నో విషయాలు హాయిగా, స్వేచ్ఛగా మాట్లాడే యామిని పెళ్లి ప్రస్తావన తెస్తే మాత్రం నిశ్శబ్దంగా నిష్క్రమించేది.


ఒకరోజు పార్కులో సిగరెట్ వెలిగిస్తే "నువ్వు స్మోక్ చేస్తావని నాకు తెలీదు. సారీ నేనిక వెళతాను" అంటూ లేచింది.

ఏమనాలో అర్థంకాక అలాగే చూస్తూ ఉండి

పోయాను సిగరెట్ కాలికింద నలిపేస్తూ. తరువాత నాలుగురోజులకు "సారీ యామినీ... ఇవ్వాళ మే నెల ముప్ఫై ఒకటి. పొగాకు వ్యతిరేక దినోత్సవంట. నేనిక స్మోక్ చేయను. ప్రామిస్... నువ్వలా నిశ్శబ్దంగా ఉండిపోతే నాకే ఏదోలా వుంటుంది. ప్లీజ్ మాట్లాడు యామినీ. ఐ నీడ్ యువర్ ఫ్రెండ్‌షిప్'' అని ఆమెను మాటల్లో పెట్టడానికి నేను పడిన అవస్థ అంతా ఇంతా కాదు. ఆమె సున్నిత హృదయాన్ని ఏమాత్రం నొప్పించకుండా వ్యవహరించడం క్రమేణా నాకు అలవాటైంది. నవంబర్ పదమూడు... ఎప్పటికీ మరచిపోలేని రోజది నాకు. మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్‌కి వెళ్లి వస్తున్నాం నేనూ, యామినీ. ఓ పదేళ్ల పిల్లవాడ్ని పట్టుకుని కొడుతున్నారు చుట్టూ చేరినవాళ్లు. వాళ్ల మాటల్ని బట్టి వాడు ఎవరి జేబులోనో పర్సు కొట్టేసినట్లు తెలుస్తోంది.

"చావగొట్టండి.. దరిద్రపుగొట్టు వెధవని. ఇంతలేడు...ఎంత పని చేసాడు...'' "వీడిని ఇలాగే వదిలేస్తే బందిపోటు దొంగవుతాడు. పోలీసుల్ని పిలవండి.'' "ఏ అక్రమ సంతానం బాపతో... నరికి పారేయండి... పీడా వదులుతుంది'' కాళ్లతో, చేతులతో, కర్రతో, బెల్టుతో ఇలా చిత్రహింస చేస్తున్నారు ఒక్కొక్కళ్లే వాడ్ని.

అప్పటిదాకా నాపక్కనే నడుస్తున్న యామిని ఎప్పుడు వెళ్లిందో గభాలున ఆ గుంపులోకి దూసుకువెళ్లి ఆ పిల్లాడికి అడ్డంగా నిలబడింది. "ఆపండిక... పసివాడని కూడా చూడకుండా ఏమిటా దౌర్జన్యం. మీరు మనుష్యులేనా? మీలో మానవత్వం లేశమైనా లేదా? అందరూ కలసి అంత క్రూరంగా కొడుతున్నారు. వాడేమైపోతాడు?'' అంటోంది ఆవేశంగా.



"ఏమిటమ్మా... వెనకేసుకొస్తున్నావు. నీ తాలూకేనా ఈ దొంగ వెధవ?'' వెకిలిగా చూస్తూ అడిగాడొకడు.

ఇంక నేను కలుగజేసుకోతప్పలేదు. "మీ పర్సు దొరికిందిగా. ఇక వెళ్లండి. వాడి సంగతి మేం చూసుకుంటాం'' అన్నాను యామిని దగ్గరకు వెళ్లి. "ఇంకెప్పుడైనా ఈ ఛాయల్లో కనిపిస్తే చంపి పారేస్తాం'' అంటూ ఒకాయన దారి తీయగా అందరూ తలో తిట్టు తిడుతూ అక్కడ్నుంచి కదిలారు. దగ్గర్లో వున్న బోరింగ్ పంపు దగ్గర వాడి ముఖం కాళ్లు చేతులు కడిగింది యామిని. హోటల్‌కు తీసుకువెళ్లి కడుపునిండా తినిపించాం.

"అమ్మా నాన్నా కూడా తెలియని అభాగ్యుడు. వీడిని ఇలా వదిలేసి వెళ్లడానికి నా మనస్సు ఒప్పుకోవడంలేదు దివాకర్. ఆ మధ్య పేపర్లో చదివాను ఇలాంటి పిల్లలకోసం వాత్సల్య అనాథాశ్రమం చేస్తున్న సేవల గురించి. వీడ్ని అక్కడ చేర్పించి వద్దాం.'' అని అప్పటికప్పుడు నన్నక్కడికి బయల్దేరతీసింది యామినీ.

అలా వాత్సల్యలో పెరిగిన ఆ అబ్బాయి అబ్దుల్ రెహమాన్ ఇప్పుడు డిగ్రీ పాసై సెంట్రల్ గవర్నమెంట్ జాబ్ చేసుకుంటున్నాడు. 'సార్...అక్కా' అంటూ అప్పుడప్పుడు వచ్చి మమ్మల్ని పలకరించిపోతుంటాడు.

"విషాదం మాటున ఇది నేను సాధించిన విజయం'' అంటుంది అశ్రు సిక్త నయనాలతో యామిని.

డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉండగా మా క్లాస్‌మేట్ నన్ను కదిలించి "ఏమిట్రా సంగతి... ఆ అమ్మాయి చుట్టూ తిరుగుతున్నావు. లవ్వా ఏమిటి వద్దురా బాబూ. తండ్రి పెద్ద తాగుబోతు, రోడ్లమీద పడిపోతుంటాడు. వితండవాదని పేరు. చుట్టాలు, పక్కవాళ్లందరితోనూ విరోధమే'' అంటూ యామినీ కుటుంబం గురించి చెప్పుకొచ్చాడు. యామిని డిప్రెషన్‌కీ, పెళ్లంటే ఏర్పడిన నిరాసక్తతకీ కారణం అర్థమైంది నాకు.

డిగ్రీ తరువాత బిఇడి చేసి నేను టీచర్‌నయితే, యామినీ ఎపిపియస్‌సి పరీక్ష పాసై ప్రభుత్వ ఉద్యోగిని అయింది. తరువాత తరువాత ఎప్పుడన్నా అరుదుగా కలుసుకుంటున్నామేగానీ తరచూ మాట్లాడుకోవడానికి వీలయ్యేది కాదు.

"ఏంటి నాయనా... ఆలోచనల్లో పడ్డావు. అమ్మాయి గురించే కదూ... పిచ్చిపిల్ల... ఈ రోజుల్లో అమ్మాయిల్లా ఉండదు. ఎలా వుంటుందిలే. దిగులు సంసారం, తాగుబోతు వెధవకి పెళ్లి చేయడం తప్పయిపోయింది. చెప్పుకుంటే సిగ్గుచేటు. తాగుడు మైకంలో పసిపిల్లాడ్ని పొట్టన పెట్టుకున్నాడు కంసుడిలా. ఆ శోకం ఆరనేలేదు తల్లీకూతుళ్లల్లో'' విషాదం గుర్తు చేసుకుంటూ ఉత్తరీయంతో కళ్లొత్తుకున్నారాయన.

నాకు చాలా బాధగా అనిపించింది. నాకెన్నడూ యామినీ ఈ విషయం చెప్పనేలేదు. పాపం... వెంటాడే చేదు జ్ఞాపకాలు వేధిస్తుంటే లోలోపల ఎంత కుమిలిపోతుందో... రెహమాన్ బంధంలో తమ్ముడి జ్ఞాపకం పెనవేసుకుందన్నమాట.

"నమ్మకమైన స్నేహితుడు దైవంలాంటివాడు అంటారు. బాబూ... నీ పేరేమిటన్నావు... ఆ...దివాకరం కదూ. అమ్మాయి ఇదివరలో నీ గురించి చెప్పినట్టే గుర్తు. బాబూ దివాకరం. అయిందేదో అయింది. ఆ తండ్రివల్ల ఇన్నాళ్లూ అయినవాళ్లందరికీ దూరమై బ్రతకాల్సి వచ్చింది. మనిషి తోడు, మాట ధైర్యం లేకుండా నేనే ఆ వెధవని పట్టించుకోకుండా అప్పుడప్పుడు కలిసొస్తుండేవాడ్ని. నువ్వూ వేరే విధంగా అనుకోకుండా కాస్త ఆదరంగా వచ్చిపోతుండు నాయనా... వాళ్లకి కొంచెం ధైర్యంగా వుంటుంది'' అన్నారాయన నా చేతిని తన చేతిలోకి తీసుకుంటూ. అలాగేనని తలూపాను.

ఆయన వెళ్లాక నేను కూడా వెళ్లొస్తానని బయల్దేరబోయాను.

"వెళతావా... నాల్రోజులపాటు ఇక్కడే ఉండకూడదూ. మాకు కాస్త సపోర్ట్‌గా ఉంటుందిగా'' బలహీనమైన స్వరంతో అంది యామిని అభ్యర్థనగా చూస్తూ.

"ఏ బంధంతో ఉండను?'' కావాలనే కోపాన్ని అభినయిస్తూ అన్నాను.

దెబ్బతిన్నట్లు చూసి "స్నేహబంధంతో'' అని ఒక్కక్షణం ఆగి "దివాకర్! నువ్వు వెళ్లొద్దు. నువ్వు నాకు కావాలి. ఎప్పటికీ నీ తోడు నాకవసరం. నా పాత చేదు జ్ఞాపకాలను వదిలించుకుని నేను నీతో జీవించాలనుకుంటున్నాను. నాకు ఆనందంగా, తృప్తిగా, తీయగా బ్రతకాలని ఉంది'' నీళ్లు నిండిన కళ్లతో అలసటగా చూస్తూ అంది యామిని.

నా నిరీక్షణ ఫలించింది. అంత విషాద వాతావరణంలోనూ యామిని అన్న ఆ నాలుగు మాటలు నన్నెంతో సంతృప్తిపరిచాయి.

☆



## శిల్ప సరికొత్త ప్రయోగం

శిల్పాశెట్టి నిర్మాతగా కూడా మారింది కదా! తను తీయబోయే సినిమాలో అలనాటి అందాల నటి రేఖను జీన్స్-టీషర్ట్ గెటప్‌లో చూపించాలని ప్రయత్నం చేస్తోందిట. 54వ ఏట అడుగుపెట్టిన రేఖలో ఇంకా గ్లామర్ తగ్గలేదని సామాన్య ప్రేక్షకుడు సైతం చెప్తాడు. అందుకనే కాబోలు శిల్పకి ఈ కోరిక కలిగినట్టుంది. తనదైన గుర్తింపు కోసం శిల్ప చేస్తున్న ప్రయోగాల్లో ఇదీ ఒకటి కాబోలు. అన్నట్టు ఈ సినిమాలో హీరో ఎవరో తెలుసా? అక్షయ్ కుమార్‌ట.

